సంపుటి :02 సంచిక :114 పేజీలు :05

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

మంగళవారం 24, జూన్ 2025


ఉష్ణోగ్రతలు

కనిష్ఠం : 27

గరిష్ఠం : 36

## ముగిసిన కస్టడీ

05

- ఈఈ నూనె శ్రీధర్ ఐదో రోజు ఏసీబీ విచారణ.
- మరోసారి కస్టడీకి తీసుకునే యోచనలో ఏసీబీ.
- కాళేశ్వరం అవినీతి సొమ్ము రియల్ ఎస్టేట్‌లోకి మళ్లింపు..

## డ్రగ్స్ రహిత కమిషనరేటే మనందరి లక్ష్యం

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

04





- క్రమశిక్షణతో నడుచుకోవాలి..
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
- పని చేసే వారికే పదవులు వరిస్తాయి..
- స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై దృష్టిసారించాలి..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్‌లో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం

02

# ఐక్యతతోనే విజయాలు

ఐక్యతతోనే విజయాలు సాధ్యమని, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు విభేదాలు పక్కనపెట్టి పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో మంగళ వారం నిర్వహించిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, ప్రభుత్వం రెండూ సమన్వయంతో ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని పార్టీ నాయకులు పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ, ప్రభుత్వం జోడెద్దుల్లా ముందుకెళ్లాలన్నారు. 18 నెలల ప్రభుత్వపాలన రాష్ట్రంలో సువర్ణాధ్యాయమని పేర్కొన్నారు. బూత్, గ్రామ, మండల స్థాయి లో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బూత్ స్థాయిలో పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వ పథకాలు ప్రజలలోకి సమర్థంగా తీసుకెళ్లగలుగుతామన్నారు. పార్టీ నిర్మాణం పైన పీసీసీ దృష్టి సారించాలన్నారు. పార్టీ నాయకులు అంతా ఐక్యంగా పని చేయాలని ఆదేశించారు. మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా అంతా పని చేయాలని పేర్కొన్నారు. పార్టీ కమిటీల్లో ఉన్న నాయకులు గ్రౌండ్ లెవెల్ లో పని చేయాల్సిందేనన్నారు. పని చేస్తేనే పదవులు వస్తాయని, పార్టీ కష్ట కాలంలో పనిచేసిన వారికి పదవులు ఇచ్చామన్నారు. పార్టీ నాయకులు క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. - అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి



# పార్టనర్ షిప్ దందా !

- ఒక్కో షట్టర్ రూ.12 లక్షల నుంచి రూ.20లక్షలకు విక్రయం?
- నింపాదిగా పేర్లు మారుస్తున్న అధికారులు
- ఆరు నెలల్లో 7 షట్టర్లు అమ్మకం...!

### లక్ష్మిపురం మార్కెట్ లో షట్టర్లకు పెరిగిన అద్దెల డిమాండ్

వరంగల్ లక్ష్మిపురం కూరగాయల మార్కెట్‌లో పార్టనర్ షిప్ దందా నడుస్తుంది. ఈ మార్కెట్ లో షట్టర్లు పొందిన కొందరు వ్యాపారులు పార్టనర్ అనే పేరుతో దొడ్డిదారిన అమ్మకాలు జరిపినట్లు తెలిసింది. పాత మార్కెట్‌లో 90మందికి కమీషన్ లైసెన్సులు ఉండగా మోడల్ మార్కెట్‌లో రెండు ఫేజుల్లో 99 షెట్టర్లు (మడిగెలు) నిర్మించగా పాత వారితో కలిపి 103మందికి కమీషన్ లైసెన్సులను అధికారులు జారీ చేశారు. పేరుకు కమీషన్ వ్యాపారులే అయినప్పటికీ ఇందులో సుమారు 70 శాతం వ్యాపారులు కూరగాయలను రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదని తెలుస్తోంది. కేవలం తమకు కేటాయించిన షట్టర్లును ఇతర వ్యాపారులకు (లైసెన్సులు, షట్టర్లు లేని) అద్దెకు ఇవ్వడమే కాకుండా ముందు ఉన్న స్థలంలో చిల్లర వ్యాపారులకు కిరాయికి ఇస్తూ నెలకు సుమారు రూ.10 వేల నుంచి రూ.15వేల చొప్పున అద్దెల రూపంలో లబ్ధి పొందుతున్నారు. అద్దెకు తీసుకుంటూ వ్యాపారం చేస్తున్న వ్యాపారులు ఏడాదికి రూ.3 లక్షలు అద్దెలు చెల్లించడం ఎందుకని భావించి ఏకంగా షట్టర్ల కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. పోటీ పెరగడంతో ఒక్కో షట్టర్ రూ.12 లక్షల నుంచి రూ.20లక్షల వరకు డిమాండ్ పలుకుతున్నట్లు సమాచారం. షట్టర్లను కొనుగోలు చేస్తే ఓనర్ షిప్ పేర్లు మార్చడం నిబంధనలకు విరుద్ధం కావడంతో భాగస్వామి పేరు తెరపైకి తెస్తున్నారు. కమీషన్ వ్యాపారం చేసే వయస్సు మీద పడిన వారు వ్యాపారం తగ్గించుకుని షట్టర్లు అమ్ముకునేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిసింది.

03

- అక్షరదర్బార్, వరంగల్

## కేసీఆర్ చెప్పు చేతల్లో ఇంటెలిజెన్స్



- హుజూరాబాద్, మునుగోడు ఎన్నికల్లో నా ఫోన్ ట్యాప్ అయింది..
- ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాల మేరకు ట్యాపింగ్ చేశారు?
- దోషులెవరో తేల్చాలి.. బాధితులకు న్యాయం చేయాలి..
- సిట్ అధికారుల విచారణకు ముందు ఎంపీ ఈటల రాజేందర్

04

## సంక్షేమానికి రూ.95,351 కోట్లు

- రూ.22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్లు
- రాజీవ్ ఆరోగ్యశ్రీలో రూ.10 లక్షల వరకు వైద్యసాయం
- 93.7 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం
- గాంధీభవన్ ప్రెస్‌మీట్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

04



# కల్వర్టుకు మరమ్మతులు

## మొరం పోయించిన మాజీ కౌన్సిలర్



అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపల్ 9వ వార్డు శ్రీనివాస్ కాలనీ కల్వర్టు దగ్గర రోడ్డు కుంగి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండగా గమనించిన తొమ్మిదవ వార్డు తాజా, మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి తన సొంత ఖర్చులతో కాంక్రిట్ తో కుంగిపోయిన కల్వర్టు ప్రాంతాన్ని మొరం పోయించి మరమ్మతు పనులు చేయించారు.. కాలనీ వాసుల సౌలభ్యమే తన ధ్యేయమని కాలనీకి ఏ సమస్య వచ్చినా తన వంతుగా సహాయం చేస్తానని అన్నారు. కాలనీవాసులు పూర్ణచారిని అభినందించారు.

# అన్నలొచ్చారు..

- రేపాక గ్రామంలోకి మావోయిస్టులు..
- ఏ నోట చూసిన ఆ మాటే..
- గ్రామంలో వినిపిస్తున్న గుసగుసలు.

అక్షర దర్బార్, రేగొండ: మండలంలోని రేపాక గ్రామంలోకి నిషేధిత మావోయిస్టు పార్టీ సభ్యులు (అన్నలు)వచ్చి పోయారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.గత 15 రోజుల క్రితం తెల్లవారుజామున ముగ్గురు మావోయిస్టులు గ్రామంలోకి వచ్చి మూడు రోజులు షెల్టర్ పొంది, ఎవరినో హత్య చేయడానికి ప్లాన్ వేశారని రేపాక గ్రామంలోని కొందరు పెద్ద మనుషులు గుసగుసలాడుతున్నారు.ఈ మాట ఆ నోట ఈ నోట గ్రామమంతా పాకడంతో గ్రామస్తులంతా షాక్ కు గురవుతున్నారు.15 రోజుల నుండి రేపాక గ్రామంలో ఏ ఇళ్లు చూసిన ఏ గల్లీ చూసిన నలుగురు కూడారంటే ఇదే టాపిక్.ఏ నోట చూసినా ఇదే మాట వినిపిస్తుంది.మూడు దశాబ్దాల క్రితం విప్లవోద్యమానికి తెలంగాణ పల్లెలు,గ్రామాలు కేంద్రంగా ఉండేవి.మావోయిస్టులు గ్రామాల్లోనే ఉంటూ వారి కార్యాకలాపాలు సాంగించేవారు.కాలక్రమేణా గ్రామాల్లో వారి ఉనికి తగ్గి రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకే పరిమితమైన మావోయిస్టులు మళ్లీ గ్రామాల్లోకి వచ్చారంటూ గుసగుసలు రావడంతో మావోయిస్టుల ముచ్చట ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.ఈ విషయంపై పోలీసులు మాత్రం ఎలాంటి సమాచారాన్ని ధ్రువీకరించలేదు.



# ఐక్యతతోనే విజయాలు

- క్రమశిక్షణతో నడచుకోవాలి..
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
- పని చేసే వారికే పదవులు వరిస్తాయి..
- స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై దృష్టిసారించాలి..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైదరాబాద్ లో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: ఐక్యతతోనే విజయాలు సాధ్యమని, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు విభేదాలు పక్కనపెట్టి పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, ప్రభుత్వం రెండూ సమన్వయంతో ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని పార్టీ నాయకులు పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ, ప్రభుత్వం జోడెద్దుల్లా ముందుకెళ్లాలన్నారు. 18 నెలల ప్రభుత్వపాలన రాష్ట్రంలో సువర్ణాధ్యాయమని పేర్కొన్నారు. బూత్, గ్రామ, మండల స్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బూత్ స్థాయిలో పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వ పథకాలు ప్రజలలోకి సమర్థంగా తీసుకెళ్లగలుగుతామన్నారు. పార్టీ నిర్మాణం పైన పీసీసీ దృష్టి సారించాలన్నారు. పార్టీ నాయకులు అంతా ఐక్యంగా పని చేయాలని ఆదేశించారు. మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా అంతా పని చేయాలని పేర్కొన్నారు. పార్టీ కమిటీల్లో ఉన్న నాయకులు గ్రౌండ్ లెవెల్ లో పని చేయాల్సిందేనన్నారు. పని చేస్తేనే పదవులు వస్తాయని, పార్టీ కష్ట కాలంలో పనిచేసిన వారికి పదవులు ఇచ్చామన్నారు. పార్టీ నాయకులు క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు.

**- ఉప ఎన్నికలపై దృష్టి సారించండి..**

జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటి సవాళ్లను ఎదుర్కోబోతున్నామని, పార్టీ నేతలు అందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. త్వరలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ఆలయ కమిటీల్లో నామినేషన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం బూత్, గ్రామ, మండలస్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఎవరైనా పని చేస్తేనే పదవులు వస్తాయని, ఊరికే ఏవీ రావని పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారికి పదవులు ఇచ్చామని, ప్రతిఒక్కరూ లక్ష్యాలు నిర్దేశించుకొని పని చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. ఒక ముఖ్యమంత్రిగా తాను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో కులగణన చేసి కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరామని, కేంద్రం కూడా జనగణనతోపాటు కులగణన చేసే పరిస్థితికి తీసుకువచ్చామని వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ తీసుకు వస్తున్నామని తెలిపారు. పార్టీ నిర్మాణంలో కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రియాశీలంగా ఉండాలన్నారు. పార్టీ పదవిని కార్యకర్తలు చిన్నచూపు చూడొద్దని, పదవుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కార్యకర్తలకు తీరని నష్టం కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

**- ఇన్ చార్జి మంత్రుల పని తీరుపై గరం..**

ఇన్‌చార్జ్ మంత్రుల పనితీరుపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. జిల్లాస్థాయిలో నామినేటెడ్ పదవులు భర్తీ చేయమని  బాధ్యతలు అప్పగించినా, ఎవరూ పట్టించుకోపోవడంపై  తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌చార్జ్ మంత్రులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వినియోగంలోనూ మంత్రులు విఫలమవుతున్నారని పేర్కొన్నారు. తమ సామాజికవర్గానికి పదవులు కట్టబెట్టాలని సోమవారం గాంధీభవన్‌లో గొల్ల కురుమలు జీవాలను విడిచిపెట్టి నిరసన వ్యక్తం చేయడంపై సీఎం సీరియస్ అయ్యారు. నిరసన తెలపడానికి కూడా ఒక పరిమితి ఉంటుందని, ఇష్టారీతిన నిరసనలు చేయడం సరికాదన్నారు. మంత్రి పదవుల కోసం ధర్నాలు చేయించడం ఏంటని.. పదవులు అడగడం తప్పు లేదని, కానీ.. ఇవాళ ఒకరు ధర్నా చేశారని రేపు ఇంకొకరు ధర్నా చేస్తారన్నారు. ఇది పార్టీలో క్రమశిక్షణారాహిత్యానికి దారితీస్తుందని మండిపడ్డారు. పార్టీలో క్రమశిక్షణ ముఖ్యమని హెచ్చరించారు. పార్టీ నాయకులు క్రమశిక్షణతో వ్యవహరించాలని హితవు పలికారు.



# ఇందిరమ్మ ఇండ్ల జాబితా ప్రకటనలో జాప్యమెందుకు?

## మహదేవపూర్ బీజేపీ అధ్యక్షులు రాంశెట్టి మనోజ్

అక్షర దర్బార్, కాటారం: మహాదేవపూర్ మండలం లో ఇందిరమ్మ ఇండ్లు కేటాయించిన అభ్యర్థుల జాబితా ప్రకటనలో జాప్యమెందుకు ఏర్పడుతుందని మహదేవపూర్  బీజేపీ మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్ ప్రశ్నించారు.మంగళవారం మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలుగా ఉన్న నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతుంటే మంథని నియోజకవర్గం లో ఐటి మినిస్టర్ ఉన్నా కూడా కనీసం ఇందిరమ్మ ఇండ్ల ఆమోదం జాబితా రాకపోవడం సిగ్గుచేటని అన్నారు. మహాదేవపూర్ మండలం లో 321 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించగా అందులో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంచుకున్న ఎలికేశ్వరం గ్రామానికి గానూ 56 ఇండ్లు ఇస్తే ఇప్పటికి అక్కడ కేవలం 30 మందికి మాత్రమే ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారన్నారు. అయితే మిగిలిన ఇందిరమ్మ ఇండ్లను ఎందుకు ఆపుతున్నారో మంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున ఇండ్ల లిస్ట్ ను ప్రకటించకుండా ఆపుతున్నారని ఐటీ మినిస్టర్ వెంటనే స్పందించి మహాదేవపూర్ మండలానికి కేటాయించిన 321 ఇండ్లకు గాను ప్రొసీడింగ్ కాపీలు ఇవ్వాలని బీజేపీ మహాదేవపూర్ పక్షాన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సాగర్ల రవీందర్, లింగంపెల్లి వంశీ, కొక్కు శ్రీనివాస్, దడిగేల వెంకటేష్ లు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పానలో రైతన్నల అరిగోస

- అన్నదాతలకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



అక్షర దర్బార్, నర్సంపేట : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలని తుంగలో తొక్కి రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు రూ.15వేలు చొప్పున ఇస్తామని చెప్పి రూ.12వేలకే పరిమితం చేయడం రైతులను మోసం చేయడం కదా అని ప్రశించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసిన పాపం ఊరికే పోదని అన్నారు. ఏడాదిన్నర పాలనలో ఒక్క చెక్ డ్యాం కట్టకుండా, కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వలేదన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ ను అటకెక్కించి పండగల ఉండే వ్యవసాయాన్ని కష్టంలోకి నెట్టి ఆర్థికంగా దెబ్బతీయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. అనతి కాలంలోనే రేవంత్ రెడ్డి మీ దుర్మార్గ పాలనలో 511 మంది రైతులు ఆత్మహత్యలు  చేసుకోవడం దారుణమన్నారు. బీ ఆర్ ఎస్ ది రైతు సంక్షేమ ప్రభుత్వం అయితే,  కాంగ్రెస్ ది రైతు సంక్షోభ ప్రభుత్వమన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని హితవు పలికారు.

# సీనియర్ జర్నలిస్ట్ దత్తు రెడ్డికి నివాళి

## టీడబ్ల్యూజేఎఫ్ హనుమకొండ జిల్లా కమిటీ



అక్షర దర్బార్, పరకాల : ఈనాడు దినపత్రిక వరంగల్ బ్యూరో చీఫ్ దత్తు రెడ్డి హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) హనుమకొండ జిల్లా శాఖ పేర్కొంది. దత్తు రెడ్డి మరణం జర్నలిస్ట్ సోదరులకు తీరని లోటు అని ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ తో పాటు హనుమకొండ జిల్లా అధ్యక్షులు టీవీ రాజు, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దామెర రాజేందర్ అన్నారు. హైదరాబాద్, నల్లగొండ, వరంగల్ జిల్లాలలో అనేక కథనాలు రాసి, మంచి పేరు తెచ్చుకున్న దత్తురెడ్డి మరణం జర్నలిస్టు లోకాన్ని శోకసంద్రంలో ముంచిందని తెలిపారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న జర్నలిస్టు దత్తు రెడ్డి మరణం చాలా బాధకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తూ, దత్తురెడ్డి మరణం తీరని లోటుగా భావిస్తూ టీడబ్ల్యూజేఎఫ్ శ్రద్ధాంజలి ఘటిస్తుందని పేర్కొన్నారు.

# ఎక్సైజ్ సిబ్బందికి అభినందనలు

అక్షర దర్బార్, పరకాల : పరకాల ఎక్సయిస్ స్టేషన్ పరిధిలోని గీసుకొండ మండలం మొగిలిచర్లకు చెందిన ధరావత్ ధన్ సింగ్ పదేపదే గుడుంబా నేరాలకు పాల్పడుతున్నందున ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ అంజన్ రావు, రూరల్ ఎక్సయిస్ సూపరింటెండెంట్ అరుణ్ కుమార్ ల ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురళీధర్, పరకాల సీఐ తాతాజీ ఆధ్వర్యంలో పీడీ యాక్ట్ నమోదు చేయగా వరంగల్ కలెక్టర్ డా. సత్య శారద ఉత్తర్వుల మేరకు ముద్దాయిని 2024 నవంబర్ 25 న చెర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించడం జరిగింది. ముద్దాయి భార్య ముద్దాయిని పీడీ చట్టం క్రింద నిర్బంధించడను సవాలు చేస్తూ హైకోర్టుకు పిటిషన్ పెట్టుకోగా ప్రమాదకరమైన గుడుంబా కేసుల్లో పీడీ చట్టం క్రింద నిర్బంధించడం సబబేనని కోర్ట్ తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు వరంగల్ రూరల్ సూపరింటెండెంట్ అరుణ్ కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురళీధర్, పరకాల సీఐ తాతాజీ, ఎస్సై జ్యోతి, సిబ్బంది ని ప్రత్యేకంగా అభినందించారు.

# అర్థశాస్త్రంలో రేగొండ వాసికి డాక్టరేట్



అక్షర దర్బార్, రేగొండ: మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన గుగులోతు రాజు నాయక్ కు అర్థశాస్త్ర విభాగంలో డాక్టరేట్ వరించింది. కాకతీయ విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్రంలో 'ఇంపాక్ట్ ఆఫ్ కమర్షియలైజేషన్ ఆఫ్ అగ్రికల్చర్-ఇన్ తెలంగాణ ఏ స్టడీ ఇన్ ' అనే అంశంపై కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఏ వినాయక్ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేసి అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో సుమారు 9 ఆర్టికల్స్, జర్నల్స్ ను సమర్పించారు. దీంతో కేయూ ప్రొఫెసర్, పరీక్షల నియంత్రణ అధికారి కట్ల రాజేందర్ గుగులోతు రాజు నాయక్ కు డాక్టరేట్ ప్రకటించారు. ఎన్ఐటీ పరిశోధకులు వినోద్ లోక్ నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రమేష్ నాయక్, ఎల్బీ కళాశాల, పింగిలి కళాశాల ఉపాధ్యాయులు డా.సదానందం, డా. రామకృష్ణారెడ్డి, కేయూ విద్యార్థి నాయకులు సుమన్ నాయక్, సేవాలాల్ సేన మురళి నాయక్ తదితరులు రాజు నాయక్ ను అభినందించారు.


అక్షర దర్బార్ Voice of the people
www.aksharadarbar.com
మంగళవారం
24.06.2025







# పార్టనర్ షిప్ దందా

- లక్ష్మిపురం మార్కెట్ లో షట్టర్లకు పెరిగిన అద్దెల డిమాండ్
- ఒక్కో షట్టర్ రూ.12 లక్షల నుంచి రూ.20లక్షలకు విక్రయం?
- నింపాదిగా పేర్లు మారుస్తున్న అధికారులు
- ఆరు నెలల్లో 7 షట్టర్లు అమ్మకం...!

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ లక్ష్మిపురం కూరగాయల మార్కెట్లో పార్టనర్ షిప్ దందా నడుస్తుంది. ఈ మార్కెట్ లో షట్టర్లు పొందిన కొందరు వ్యాపారులు పార్టనర్ అనే పేరుతో దొడ్డిదారిన అమ్మకాలు జరిపినట్లు తెలిసింది. పాత మార్కెట్లో 90మందికి కమీషన్ లైసెన్సులు ఉండగా మోడల్ మార్కెట్లో రెండు ఫేజుల్లో 99 షెట్టర్లు (మడిగెలు) నిర్మించగా పాత వారితో కలిపి 103మందికి కమీషన్ లైసెన్సులను అధికారులు జారీ చేశారు. పేరుకు కమీషన్ వ్యాపారులే అయినప్పటికి ఇందులో సుమారు 70శాతం వ్యాపారులు కూరగాయలను రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదని తెలుస్తోంది. కేవలం తమకు కేటాయించిన షట్టర్లను ఇతర వ్యాపారులకు (లైసెన్సులు, షట్టర్లు లేని) అద్దెకు ఇవ్వడమే కాకుండా ముందు ఉన్న స్థలంలో చిల్లర వ్యాపారులకు కిరాయికి ఇస్తూ నెలకు సుమారు రూ.10 వేల నుంచి రూ.15వేల చొప్పున అద్దెల రూపంలో లబ్ది పొందుతున్నారు. అద్దెకు తీసుకుంటూ వ్యాపారం చేస్తున్న వ్యాపారులు ఏడాదికి రూ.3 లక్షలు అద్దెలు చెల్లించడం ఎందుకని భావించి ఏకంగా షట్టర్ల కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. పోటీ పెరగడంతో ఒక్కో షట్టర్ రూ.12 లక్షల నుంచి రూ.20లక్షల వరకు డిమాండ్ పలుకుతున్నట్లు సమాచారం. షట్టర్లను కొనుగోలు చేసే ఓనర్ షిప్ పేర్లు మార్చడం నిబంధనలకు విరుద్దం కావడంతో భాగస్వామి పేరు తెరపైకి తెస్తున్నారు. కమీషన్ వ్యాపారం చేసే వయస్సు మీద పడిన వారు వ్యాపారం తగ్గించుకుని షట్టర్లు అమ్ముకునేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిసింది.

## 6 నెలల్లో 10షాపులు విక్రయం?

**మోడల్ మార్కెట్ లో ఇప్పటి వరకు 10 షాపులు చేతులు (విక్రయాలు) మారినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికి పక్కాగా 7షాపులు మాత్రం సేల్ అయినట్లు సమాచారం. ఒక్కో షాపునకు రూ.12 నుంచి రూ. 20లక్షలు చెల్లించి వ్యాపార భాగస్వామిగా అగ్రిమెంటు రాసుకున్నట్లు తెలిసింది. గతంలో కొన్నాళ్లు పేరు మీద షాపులు మారాయి కాదా మావి కూడా తప్పకుండా మారుతాయన్న ధీమాతో పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించి కొనుగోళ్లు చేస్తున్నట్లు సమాచారం. మార్కెట్ లో ఉన్న షట్టర్లలో సుమారు 75 వాటిల్లో బినామీలే వ్యాపారం చేస్తున్నట్లు పక్కా సమాచారం. కమీషన్ వ్యాపారం చేస్తున్నారా లేదా అనే విషయం గుర్తించేందుకు తక్ పట్టీలు రాయాలని మార్కెట్ అధికారులు ఆదేశించి పుస్తకాలు అందించినా అమలులోకి రాలేదు. ఈవిషయంపై అధికారులు పట్టించుకోక పోవడంతో షట్టర్లు పొందిన కొందరు వ్యాపారులు బినామీ దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా యథేచ్చగా సాగుతున్నదన్న టాక్ వినపడుతుంది.**

## - అద్దెలు పెండింగ్..?

ప్రస్తుతం ఎలాంటి వ్యాపారం చేయని వారి ఆధీనంలో షట్టర్లు ఉండడం వల్ల అద్దెల వల్ల రూ.వేల లబ్ది పొందుతున్నప్పటికి మార్కెట్ కమిటీకి అద్దెలు కట్టకుండా పెండింగ్లో పెట్టినట్లు తెలుస్తోంది. కమీషన్ లైసెన్సులు ఉన్న వారు వ్యాపారం చేయకుంటే షట్టర్లను మార్కెట్ కమిటీకి సరెండర్ చేయాల్సి ఉంటుంది. ఇలా చేస్తే కమీషన్ కడుతూ వ్యాపారం చేస్తున్న ఇతర వ్యాపారులకు షట్టర్లు కేటాయించేందుకు వీలవుతుంది. ఈనిబంధనను పాటిస్తే షట్టర్లు సరెండర్ చేసిన వ్యాపారికి ఎలాంటి లబ్ది చేకూరదు. ఒక వేళ అమ్మినా పేరు మారదు. అందువల్ల ఈనిబంధనలను తుంగలోకి తొక్కి వ్యాపార భాగస్వామి అనే పేరుతో మోడల్ మార్కెట్లో షట్టర్ల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈవిషయం అధికారుల దృష్టికి వచ్చినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## - అటకెక్కిన విచారణ

మోడల్ కూరగాయల మార్కెట్లో షట్టర్లు, మడిగెలు, ఫ్లాట్ల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై మంత్రి కొండా సురేఖ విచారణ జరపాలని కలెక్టర్ను ఆదేశించినా నేటి వరకు ముందుకు సాగలేదని తెలుస్తోంది. విచారణ జరిపితే అక్రమాలు బయటపడతాయని భావించిన మార్కెట్ వ్యాపారులు, పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. కొందరు పాత పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం వల్లనే ఈ పరిస్థితి నెలకొన్నదన్న చర్చ మార్కెట్లో నడుస్తుంది.

# కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పాలన

- ఏఎంసీ వైస్ చైర్మన్ మహ్మద్ రఫీ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: ఎలక్షన్ల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం నెరవేరుస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని చిట్యాల ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీ అన్నారు. మంగళవారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షులు ఆకుతోట కుమారస్వామి అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి కాంగ్రెస్ పార్టీని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మండలంలోని ఇందిరమ్మ ఇండ్లపై అవకతవకలు జరిగినట్లు మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కళపల్లి రాజు యూరా రవికుమార్ ఖ్యాత రాజు రమేష్ దండ వెంకటేశ్వర రెడ్డి మంగళం పల్లి శ్రీనివాస్ బండారి భద్రయ్య రామారావు మండ రవీందర్ శివారెడ్డి నడిగోటి రాము పాల్గొన్నారు



# వానరానికి అంత్యక్రియలు



అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలో సోమవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని వానరం మృతి చెందింది. వానర మృతదేహాన్ని అక్కడే వదిలి వేయకుండా స్థానిక బిర్యాని పాయింట్ ఓనర్ వల్లాల ప్రవీణ్ కుమార్, బండి రాజు, గోల్కొండ అజయ్ చలి వాగు ప్రాంతానికి తీసుకువెళ్లి పూజలు చేసి అంత్యక్రియలు నిర్వహించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. దీనితో హనుమాన్ భక్తులు గ్రామస్తులు వారిని అభినందించారు.

# నాసిరకంగా సీసీరోడ్ల నిర్మాణం

- కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరికిపండ్ల అశోక్ డిమాండ్



అక్షర దర్బార్, కేసముద్రం : కాట్రపల్లి గ్రామంలో ఇటీవల నిర్మించిన సిసి రోడ్లలో కాంట్రాక్టర్లు ఎక్కడ నాణ్యత ప్రమాణాలు పాటించలేదని బిజెపి ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరికిపండ్ల అశోక్ అన్నారు.మంగళవారం నాడు మండలంలోని కాట్రపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ... సిసి రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించలేదని మండిపడ్డారు. ప్రజాధనం దుర్వినియోగం అయితే అధికారులు పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మించిన ఏ రోడ్లలో కూడా నాణ్యత లేదని ధ్వజమెత్తారు. పది కాలాలపాటు ఉండాల్సిన రోడ్డు పట్టుమని పది రోజులు కూడా ఉండదని అన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు రాకుండా నిలిపివేసి మరల రోడ్లను నిర్మించాలని అన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల విషయంలో పారదర్శకత పాటించలేదని,ఇండ్లు ఉన్నవారికే ఇండ్లను ఇచ్చారని ఆరోపించారు.ఆ ఇండ్లు కూడా నాణ్యత పాటించడం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో జల్లె విజేందర్,జల్లే పెద్ద విజందర్,పుల్ల కరుణాకర్,పానుగంటి సురేందర్,పసునూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# దత్తురెడ్డికి మంత్రి సీతక్క నివాళి

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ ఈనాడు స్టాఫ్ రిపోర్టర్ దత్తురెడ్డి హఠాన్మరణం పట్ల పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ, ఆర్ డబ్ల్యూఎస్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్, నల్లగొండ, వరంగల్ స్టాఫ్ రిపోర్టర్ గా దత్తురెడ్డి అనేక కథనాలు రాసి, మంచి పేరు తెచ్చుకున్నారని, జర్నలిస్ట్ గా ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న దత్తురెడ్డి హఠాన్ మరణం అత్యంత బాధకరమని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దత్తురెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని ప్రార్థించారు.

**- బాధాకరం : మంత్రి సురేఖ**

యువ జర్నలిస్ట్ దత్తురెడ్డి అకాల మరణం బాధాకరమని మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యంత చిన్న వయస్సులోనే గుండె పోటుకు గురై ఆయన ప్రాణాలు కోల్పోవటం దిగ్భ్రాంతికరమని అన్నారు. దత్తురెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# రైతు సంబరాల్లో ఎమ్మెల్యే రేవూరి

అక్షర దర్బార్, పరకాల : దామెర మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు భరోసా సంబరాలలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశానుసారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సోద రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ దాసరి



బిక్షపతి, మాజీ కౌన్సిలర్ లు పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్, మాజీ ఎంపీపీ స్వర్ణలత, చందుపట్ల రాఘవరెడ్డి, దార్న వేణుగోపాల్, నల్లెల అనిల్, పసుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ చెప్పుచేతల్లో ఇంటెలిజెన్స్

- హుజూరాబాద్, మునుగోడు ఎన్నికల్లో నా ఫోన్ ట్యాప్ అయింది..
- ప్రభాకర్ రావు ఎవరి ఆదేశాల మేరకు ట్యాపింగ్ చేశారు?
- దోషులెవరో తేల్చాలి.. బాధితులకు న్యాయం చేయాలి..
- సిట్ అధికారుల విచారణకు ముందు ఎంపీ ఈటల రాజేందర్



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పుచేతల్లో ఇంటెలిజెన్స్ పనిచేసిందని, తాను హుజూరాబాద్, గజ్వేల్ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు తన ఫోన్ ట్యాప్ అయిందని మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో ప్రత్యేక దర్యాప్తు బృంద (సిట్) విచారణకు హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాపింగ్ చేశారనేది.. తేల్చాల్సి ఉందన్నారు. బీజేపీ నాయకులు పరస్పరం మాట్లాడుకున్న సంభాషణను కూడా ఫోన్‌ట్యాపింగ్ చేశారని, సిట్ సేకరించిన డాటాలో ఆ కాల్స్ కూడా ఉన్నాయన్నారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో బీజేపీ నేతలు ఎవరితో మాట్లాడుతున్నారు? ఏం చేస్తున్నారు? అనేది గుట్టుగా విన్నారని మండిపడ్డారు. ప్రభాకర్‌రావు ఐపీఎస్ అధికారి కాదని, అయినప్పటికీ.. నాటి ప్రభుత్వం ఆయన్ను ఎస్ఐబీ చీఫ్‌గా నియమించిందని పేర్కొన్నారు. ఒక విశ్రాంత అధికారిని అంత పెద్ద పోస్టులో ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. నిబంధనలు, మార్గదర్శకాలను తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. ఫోన్లు ట్యాప్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని, జడ్జిలు, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల ఫోన్లు ట్యాపింగ్ కావడం ప్రజాస్వామ్యంపై గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై వేసిన సిట్ ఏడాదిన్నర నుంచి విచారణ చేపడుతున్నదని, అయినా.. కేసులో అతీగతి లేదని వాపోయారు. బీజేపీ, కాంగ్రెస్ లాలూచీపడకపోతే విచారణ నివేదికలు ఎందుకు బయటపెట్టలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఫోన్‌ట్యాపింగ్ బాధితులు వేల సంఖ్యలో ఉన్నారని, ప్రభుత్వం దోషులకు శిక్షపడేలా చేసి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

# సంక్షేమానికి రూ.95,351 కోట్లు

- రూ.22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్లు
- రాజీవ్ ఆరోగ్యశ్రీలో రూ.10 లక్షల వరకు వైద్యసాయం
- 93.7 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం
- గాంధీభవన్ ప్రెస్ మీట్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి



అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: తెలంగాణలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేశామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రూ.22 వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు వైద్య సహాయం అందిస్తున్నామని వెల్లడించారు. పథకం ద్వారా 94 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.6 వేల కోట్ల విలువైన 189 కోట్ల ఉచిత బస్సు టికెట్లు ఇచ్చామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేకుండా రుణాలు అందజేస్తున్నామని వివరించారు. రేషన్‌కార్డుదారులకు 93.7లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు.

## డ్రగ్స్ రహిత కమిషనరేటే

# మనందరి లక్ష్యం

**వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**

అక్షరదర్బార్, హనుమకొండ: డ్రగ్స్ రహిత వరంగల్ పోలీస్ కమిషనరేట్‌గా గుర్తింపు సాధించడమే మనందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని డ్రగ్స్ వ్యతిరేకంగా, ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలను ఈ సమాజం నుంచి తరిమి కొట్టేందుకు ప్రతి ఒక్క పౌరుడు భాగస్వాములు కావడంతో పాటు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ వారోత్సవాల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని వర్గాల ప్రజలకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించడంతో పాటు, వాటి వినియోగం ద్వారా నష్టాలపై ప్రజలకు పోలీసులు వివరించడం జరుగుతోందని, ముఖ్యంగా ఉన్నత విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ డ్రగ్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీలు, డ్రాయింగ్, వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేయడం జరుగుతోందని, ఎవరైన మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన తక్షణమే 8712584473 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.






# విక్రయాలు సాఫీగా నిర్వహించాలి

- ములుకనూరు ఎరువుల గోదాంను పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లా భీమదేవర పల్లి మండలం ములుకనూరులోని ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల గోదాంను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం పరిశీలించారు. గోదాంలోని ఎరువుల బస్తాలు, యూరియా బస్తాలు, ఇతర ఎరువులను కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఈ సీజన్ లో ఎంత ఎరువులు అమ్మడయ్యాయని, ఇంకా ఎంత మొత్తం స్టాక్ ఉందని, నిర్వహణ చేస్తున్న తీరు, గత సంవత్సరంలో ఎరువుల క్రయవిక్రయాలు, ఈ గోదాం నుంచి ఎరువులను ఎక్కడెక్కడికి తీసుకెళ్తారని వివరాలను వ్యవసాయ అధికారులతో పాటు గోదాం నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సీజన్ లో ఎరువుల విక్రయాలు సాఫీగా నిర్వహించాలని, ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, స్థానిక తహసీల్దార్ రాజేష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు రోజులు వానలు

- హైదరాబాద్ వాతావరణశాఖ ప్రకటన
- ములుగు, భూపాలపల్లి జిల్లాలకు ఎల్లో అలెర్ట్

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణవ్యాప్తంగా నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ మంగళవారం ప్రకటించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని.. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురు గాలులతో వర్షాలు పడతాయని పేర్కొంది. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కొనసాగుతాయని పేర్కొన్నది. గురువారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలు, శుక్రవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు వర్షం కురుస్తుందని ప్రకటించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 48 గంటల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. కుమంభీం జిల్లాలో వానలు దంచికొట్టాయి. అత్యధికంగా దహెగాంలో 6.9 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైంది.

# పండుగ వాతావరణంలో ముఖ్యమంత్రి ముఖాముఖి

అక్షరదర్బార్, గణపురం: రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం పంట సాగుకు ప్రవేశ పెట్టిన "రైతు భరోసా" పథకం కింద కేవలం 9 రోజుల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్ డా బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఆవరణల నుంచి నిర్వహించిన "రైతు భరోసా సంబరాలలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి గణపురం మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, వ్యవసాయ శాఖ ఏడీఏ బాబు, ఉద్యానవన శాఖాధికారి సునీల్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్హూర్ నాయక్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ భాస్కర్, సింగిల్ విండో చైర్మన్ కుమార్ యాదవ్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# ముగిసిన కస్టడీ

- ఈఈ నూనె శ్రీధర్ ఐదో రోజు ఏసీబీ విచారణ
- మరోసారి కస్టడీకి తీసుకునే యోచనలో ఏసీబీ
- కాళేశ్వరం అవినీతి సొమ్ము రియల్ ఎస్టేట్ లోకి మళ్లింపు..

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) నూనె శ్రీధర్ అక్రమాస్తుల చిట్టా రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో అరెస్టయిన శ్రీధర్‌ను ఏసీబీ అధికారులు ఐదో రోజు మంగళవారం కూడా కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆయన కస్టడీ గడువు ముగియనుండగా, మరిన్ని కీలక ఆధారాలు సేకరించేందుకు మరోసారి కస్టడీకి తీసుకునే ఆలోచనలో ఏసీబీ ఉన్నట్లు సమాచారం. అక్రమంగా ఆస్తులు కూడబెట్టారంటూ కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈగా పనిచేసిన శ్రీధర్‌పై ఏసీబీ అధికారులు ఈ నెల 11న కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అధికారుల సోదాల్లో పెద్ద ఎత్తున ఆస్తులు గుర్తించారు. వాటి విలువ మార్కెట్ లెక్కల ప్రకారం రూ.150 కోట్ల మేర ఉంటుందని అంచనా వేశారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న శ్రీధర్‌ను కోర్టు అనుమతితో ఏసీబీ అధికారులు ఐదు రోజుల కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈనెల 20వ తేదీ నుంచి విచారణ కొనసాగుతోంది. సోమవారం శ్రీధర్‌కు చెందిన బ్యాంకు లాకర్లను ఆయన సమక్షంలోనే తెరిచిన అధికారులు, భారీగా స్థిరాస్తుల పత్రాలు, బంగారు ఆభరణాలను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.5 కోట్లకు పైనే ఉంటుందని అంచనా వేశారు. విచారణలో చివరి రోజైన మంగళవారం మరికొన్ని లాకర్లను కూడా తెరిచినట్టు సమచారం.

ఇంతవరకు జరిగిన విచారణలో శ్రీధర్ అక్రమంగా సంపాదించిన డబ్బును మొత్తంలో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడిగా పెట్టినట్లు ఏసీబీ అధికారులు ఆధారాలు సేకరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో 6, 7, 8 పనులను పర్యవేక్షించిన శ్రీధర్, ఈ క్రమంలో భారీగా అవినీతికి పాల్పడి, ఆ సొమ్మును భూములు, ఇతర స్థిరాస్తుల కొనుగోలుకు మళ్లించినట్లు గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి సంబంధించి అరెస్టయిన మిగతా వారు కూడా అక్రమంగా సంపాదించిన సొమ్మును రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులుగా పెట్టినట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది. శ్రీధర్ కస్టడీ గడువు మంగళవారంతో ముగిసింది. అయితే, కేసు దర్యాప్తులో ఇంకా అనేక కీలక అంశాలు వెలుగులోకి రావాల్సి ఉందని భావిస్తున్న ఏసీబీ అధికారులు, కోర్టు అనుమతితో శ్రీధర్‌ను మరోసారి కస్టడీకి తీసుకుని ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కేసులో ఆయన పాత్ర, ఇతర అధికారుల ప్రమేయం, అక్రమాస్తుల మూలాలు వంటి అంశాలపై మరింత లోతుగా విచారించాల్సి ఉందని అధికారులు భావిస్తున్నారు.

## మాట ఇచ్చాం..

# నిలబెట్టుకున్నాం!



- రుణమాఫీ చేశాం.. రైతుభరోసా ఇచ్చాం..
- రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగ చేశాం..
- కాళేశ్వరంతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కోటీశ్వరులయ్యారు..
- తెలంగాణ మాత్రం దివాళా తీసింది..
- 'రైతునేస్తం' సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: 'అసెంబ్లీ ఎన్నికల ముందు మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం. రైతులకు సంబంధించిన రుణమాఫీ చేశాం. అర్హులైన రైతులందరి ఖాతాల్లో రైతుభరోసా సొమ్ము జమ చేశాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు జమ చేశామన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా మంగళవారం నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగ చేసేందుకే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆనాడు పంటలకు ఉచిత విద్యుత్ అందించారని గుర్తుచేశారు. రైతుల ఆశీర్వాదం వల్లనే తాను చిన్నవయస్సులో సీఎం అయ్యానని, రైతాంగం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా నిధుల పంపిణీ ప్రక్రియ పూర్తిచేశామన్నారు. మహిళలు, యువత తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్నవడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని చెప్పామని, అలాగే ఆ మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం తమ నెత్తిన రూ.8 లక్షల కోట్లకుపైగా అప్పులు మోపిందన్నారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కడితే.. అది కాస్తా కూలిందన్నారు. ప్రాజెక్ట్ కమీషన్లతో నాటి సీఎం కేసీఆర్, నాటి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కోటీశ్వరులైతే, రాష్ట్రం రాష్ట్రం మాత్రం దివాళా తీసిందన్నారు. గత ప్రభుత్వం వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూసేయిస్తే, తమ ప్రభుత్వం సర్కార్ బడులకు ప్రాణం పోస్తుందన్నారు. ఏడాదిన్నర పాలనలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలు తీసుకువచ్చామని వెల్లడించారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. వెయ్యి బస్సులు ఆర్టీసీకి మహిళలు అద్దెకు ఇచ్చేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

# పైసా కొట్టూ.. ఇందిరమ్మ ఇల్లు పట్టూ..

- నగదు అప్పజెప్తేనే అర్హులు
- గుట్టుచప్పుడు కాకుండా జోరుగా దందా...
- ఇల్లు ఆశచూపి ఓ వ్యక్తి నుంచి రూ.18వేలు వసూలు...
- అర్హుల జాబితాలో పేరు రాకపోవడంతో ఖంగుతిన్న బాధితుడు
- నిలదీస్తే బీఆర్ఎస్ కార్యకర్తవంటూ బుకాయింపు..

అక్షర దర్బార్, కేసముద్రం : నిరుపేదలకు ఇచ్చే ఇంటిలో కూడా అవినీతి తిమింగళాలు జొరబడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పేదలకు ఇందిరమ్మ ఇంటి పథకంలో దళారులు మోపయ్యారు. ఇంటి ఆశచూపి వేలకు వేలు దండుకుంటున్నారు. నిరుపేదల దగ్గర మధ్యవర్తులు వేలాది రూపాయలు పోగు చేసుకుంటున్నారు. తీరా చూస్తే అర్హుల జాబితాలో పేరు లేకపోవడంతో ఓ బాధితుడు నివ్వెరపోయాడు ఎందుకని ఆరా



తీస్తే.. నువ్వు విపక్షపార్టీకి చెందిన కార్యర్తవు అంటూ బుకాయించడం మొదలు పెట్టి చేతులు దులుపుకున్నారు. దీంతో ఆ బాధితుడు ఎవరిని కలవాలో.. ఏంటో తెలియని అయోమయం పరిస్థితి అక్షర దర్బార్ పత్రికను ఆశ్రయించాడు. తీరా లోతుగా విచారణ చేస్తే తన గోడును వెలబోసుకున్నాడు. ప్రభుత్వం గూడు నీడ లేని నిరుపేదలకు సొంత ఇంటిని కట్టి ఇవ్వాలని నిర్ణయించింది. బలహీన వర్గాలకు అండగా నివాలనే కృతనిశ్చయంతో అర్హుల జాబితాను ప్రకటించి.. ఆయా లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను సైతం అందించింది. దీంతో పలువురు అర్హులు ఇంటి ఇంటి నిర్మాణం కోసం ముగ్గులు పోసుకొని పనులు కూడా షురూ చేశారు. అయితే ఈ అర్హుల వద్ద నగదును ఆశించిన ఘటన... మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. ఇటీవలి కాలంలో ఓ లబ్దిదారుడి వద్ద.. కొంతమంది ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని రూ. 30వేల నగదును ఆశించారు. చెప్పిన నగదు ఇస్తేనే అర్హుల జాబితాలో పేరొస్తుందని ఆశ చూపారు. నిజమేనను కున్న బాధితుడు వారు అడిగినంత కాకున్నా.. రూ. 18వేల వరకు అప్పజెప్పాడు. అంతా సవ్యంగానే ఉందనుకున్న సమయంలో తీరా అర్హుల తుది జాబితాలో తన పేరు రాలేదు. ఇదేంటని బాధితుడు నగదు అప్పజెప్పిన వారిని ఆరా తీస్తే.. నువ్వు గులాబీ పార్టీ కార్యకర్తవు, ఆ పార్టీ జెండా వేసుకొని తిరిగావు.. అందుకే నీకు ఇళ్లు రాలేదు అని బుకాయించారు. దీంతో ఖంగుతిన్న బాధితుడు ఎంత మోసపోయానని తీవ్ర ఆవేదన చెందాడు.


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278 ★ RNI NO. TELTEL/2022/81915